క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ: పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు డాక్టర్స్ కాలనీ, అన్నారికాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని వినతి

చిట్యాల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జన్నపాల శ్రీను శనివారం హైదరాబాద్‌లో టీఎస్‌ఎంఎస్ఐడీసీ(తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి రోగుల సంఖ్యకు అనుగుణంగా లేదని, వెంటనే వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

చండూరు మార్కెట్ అభివృద్ధికి రూ.3.96 కోట్లు

చండూరు: చండూరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చొరవతో రూ.3.96కోట్లు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుర్రం మాధవి అన్నారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చండూరులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1.80 కోట్లు, మునుగోడు సబ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.90,00,000, నారాయణపూర్ సబ్ మార్కెట్ కార్యాలయం గోదాం, ప్రహరీ నిర్మాణానికి రూ.1.26 కోట్లు విడుదలైనట్లు వివరించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ టౌన్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పీఆర్‌సీ సిఫారసుల ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని దొడ్డికొమరయ్య భవన్‌లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులను తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టి చేయించడం అన్యాయమన్నారు. వెంటనే కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పోతెపాక వినోద్‌కుమార్, పి. అంజయ్య, ఏర్పుల సైదులు, ఎం. పరమేష్, సర్వయ్య, రెడ్డిమల్ల యాదగిరి, ఇరిగి ఎల్లేష్, జి. గంగారాం, రమేష్, వెంకన్న, నరేష్, బాలమ్మ, పెద్దమ్మ, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ



కేశరాజుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని కేశరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంతో పాటు తిప్పర్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీఓ జయచంద్రారెడ్డి తనిఖీ చేశారు. అదనంగా 45 మంది హమాలీలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బి. శ్రీకాంత్ ఆర్డీఓకు తెలియజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, ఆర్ఐ నరహరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పశువుల కొట్టాలు, గడ్డివాములు దగ్ధం



దగ్ధమవుతున్న పశువుల కొట్టం, గడ్డివాము

మునుగోడు: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని నేరటోనిగూడేనికి చెందిన ఇద్దరు రైతుల పశువుల కొట్టాలు, గడ్డివాములు శనివారం దగ్ధమయ్యాయి. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు పోషగోని లింగయ్య, పోషగోని శంకరయ్య పశువుల కొట్టాలు, గడ్డివాములు ఒకే దగ్గర ఉన్నాయి. ఆ పక్కనే భూమి కలిగిన నలుగురు రైతులు మధ్యాహ్నం తమ భూములు కొలతలు వేసుకున్నారు. ఆ భూమిలో అడ్డుగా ఉన్న తుంగకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు పెద్దగా లేచి ఆ పక్కనే ఉన్న గడివాములపై పడటంతో ప్రమాదం జరిగింది. దీంతో పశువుల కొట్టాల్లో ఉన్న వ్యవసాయ సామగ్రితో పాటు ధాన్యం, ఇతర వస్తువులు కాలి బూడిదవడంతో ఒక్కో రైతులకు రూ.1.50లక్షల నష్టం వాటిల్లింది.

నకిలీ విత్తనాల అమ్మకంపై కొరడా

- ప్రత్యేక బృందాలతో దుకాణాలపై దాడులు
- పట్టుబడితే కేసులు నమోదు

మునుగోడు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి మోసానికి గురికాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించకుండా అటు వ్యవసాయ అధికారులు, ఇటు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు దుకాణాలు, అక్రమ వ్యాపారుల ఇళ్లపై సోదాలు నిర్వహిస్తున్నారు. దీంతో కేసుల పాలై జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందని నకిలీ వ్యాపారులు భయపడుతున్నారు.

డివిజన్ వ్యాప్తంగా 142 దుకాణాలు..

మునుగోడు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 142 దుకాణాల ద్వారా విత్తనాలు విక్రయించేందుకు వ్యవసాయ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఇందులో మునుగోడులో 37 , చండూరులో 43, మర్రిగూడలో 29, నాంపల్లిలో 33 దుకాణాలు ప్రభుత్వం గుర్తించిన కంపెనీల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలి. అయితే కొందరు వ్యాపారులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విత్తనాలు తీసుకొచ్చి తక్కువ ధరకు రైతులకు అంటగడుతున్నారు. అవి నాణ్యమైనవి కాకపోవడంతో దిగుబడి సరిగ్గా రాక రైతులు నష్టపోతున్నారు. ఇలా రైతులు మోసపోయి ఇబ్బందులు పడకుండా వారం క్రితం జిల్లా వ్యాప్తంగా విత్తనాల విక్రయం దుకాణాలల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అంతేకాకుండా విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎక్కువగా పత్తి పంటనే సాగు చేస్తుండటంతో పత్తి విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో పత్తి విత్తనాలు నకిలీలు లేకుండా చూసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నారు. గత నెల 29న మర్రిగూడ మండలంలో నకిలీ విత్తనాలు పట్టుబడగా పోలీసులు విక్రయదారులపై కేసులు నమోదు చేశారు.



మునుగోడులో ఓ దుకాణాంలో విత్తనాలను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు (ఫైల్)

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



విత్తన వ్యాపారులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విత్తనాలను మాత్రమే విక్రయించాలి. అనుమతులేని విత్తనాలు విక్రయిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తాం. రైతులు కూడా తక్కువ ధరకు లభించే విత్తనాలు కొనుగోలు చేయొద్దు. అన్ని అనుమతులు ఉన్నవాటిని కొని తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

– ఎస్. శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మునుగోడు

కేసులు నమోదు చేయాలి



కొందరు వ్యాపారులు అధిక లాభం కోసం నాణ్యత లేని విత్తనాలు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని గుర్తించి వారి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసు నమోదు చేయాలి. రైతులు కూడా తక్కువ ధర విత్తనాలు కొనుగోలు చేయకుండా అన్ని అనుమతులు ఉన్న విత్తనాలనే కొనాలి.

– గుర్జ రామచంద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సమాచారం అందించాలి



ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. నకిలీ విత్తనాలను పట్టుకునేందుకు గట్టి నిఘా పెట్టాం. ఇప్పటికే చాలా దుకాణాల్లో సోదాలు చేశాం. పట్టుబడిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం.

– డి. సతీష్‌రెడ్డి, ఎస్ఐ, మునుగోడు

ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



రెగ్యులరైజ్ చేస్తూ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టౌన్: వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు దేశానికే ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ శనివారం నల్లగొండ పట్టణంలోని జెడ్పీ కార్యాలయం ఆవరణలో మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగుల పట్ల తన నిబద్ధతను చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి మత్స్యగిరి, శుభకరణ్‌సింగ్, శ్రీకాంత్, ఖలీముద్దీన్, భిక్షం, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

కుల వృత్తులు చేసుకునే బీసీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డిని ఎంబీసీ సంఘం జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని వర్తింపచేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు చికరాజు చెన్నయ్య, నోముల రవి, గుంటోజు బ్రహ్మాచారి, నిమ్మనగోటి కృష్ణయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



వల్లభాపురంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. నకిరేకల్ మండలంలోని వల్లభాపురం గ్రామంలో శనివారం ఆయన మార్నింగ్ వాక్‌లో భాగంగా ఇంటింటి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించి, 17మంది దళితబంధు పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దళితబంధు పథకం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. అనంతరం గ్రామంలో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు తెలపడంతో తక్షణమే బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు మాద నగేష్, నోముల కేశవరాజు, ఏకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, పక్కన నెల్లికంటి సత్యం

చండూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 4న కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో సీపీఐ ఆధ్వర్యంలో లక్ష మందితో నిర్వహించనునన ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం చండూరు మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గం సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను కొల్లగొడుతుందన్నారు. బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాగర్జన బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు, బరిగెల వెంకటేష్, దోటి వెంకన్న, సీహెచ్. ఊషయ్య, గంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుపల్లిలో బైక్ అపహరణ

- వరుస చోరీలు జరుగుతున్నా స్పందించని పోలీసులు

మాడుగులపల్లి: దుకాణం ఎదుట పార్క్ చేసిన బైక్‌ను అర్ధరాత్రి దుండగులు అపహరించారు. మండలంలోని చెరువుపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రె లింగారెడ్డి ఇంటి పక్కనే ఉన్న షెటర్‌లో సిమెంట్ దుకాణం పెట్టాడు. ఈ నెల 25న దుకాణం వద్ద బైక్ పెట్టి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మండలంలో వరుస బైక్ చోరీలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం మండల కేంద్రంలో కొందరి బైకులు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లోనూ జరుగుతుండడంతో జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లాలో ఇదే తరహా చోరీలకు పాల్పడిన ఓ పాత నేరస్తుడు ప్రస్తుతం మండలంలో సంచరిస్తూ చోరీలకు తెరలేపినట్లు సమాచారం. వరుస చోరీలు జరుతున్నా పోలీసుశాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీసీ కెమెరాలతో నేరస్తుల గుర్తింపు సులభం

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ క్రైం: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరస్తులు, దొంగలను సులభంగా గుర్తించవచ్చని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలను స్థానిక కౌన్సిలర్ దాసరి గోపమ్మ, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. రోడ్ల పనులు పూర్తికాగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, కంకణాల నాగిరెడ్డి, మామిడి పద్మ, దాసరి సాయియాదవ్, సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ సతీష్ తదితరులు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో హమాలీలకు బుడిగె యాదగిరి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బుడిగె శ్రీనివాసులు–నాగమణి దంపతుల ఆర్థిక సహకారంతో శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ సతీష్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, ప్రతినిధులు దునుక వెంకన్న, వెంకటాచారి, వేణుగోపాల్‌రెడ్డి, అశోకాచారి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

నకిరేకల్: మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి సమక్షంలో నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి చెనగాని రాములు, మండల సోషల్ మీడియా కన్వీనర్ బండమీది శ్రీకాంత్, ముచ్చపోతుల అనసూర్య, భీమనబోయిన శ్రీనివాస్, చెనగాని అంజయ్య, దూదిమెట్ల లింగయ్య, వీరయ్య, మహేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, సిబ్బంది మల్లికార్జున్, రైతులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం: బైక్‌పై అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డు శ్రీనగర్ కాలనీకి చెందిన గాదెపాక అరవింద్ స్వామి(23), అదే కాలనీకి చెందిన గురురాజు బైక్‌పై హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తుండగా చర్లపల్లి వద్ద రోడ్డు డివైడర్‌ను అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అరవింద్‌స్వామి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందగా గురురాజుకు కాలు విరిగింది. మృతుడు ప్రైవేటు ఉద్యోగి. మృతుడి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపారు.

బేడ బుడగ జంగాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లో బుర్ర కథలు, యక్షగానాలు, తోలు బొమ్మలాట, జంగమదేవర వేషాలు వేస్తూ జీవనం సాగించే బేడ బుడగ జంగాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని ప్రజా పోరాట సమితి(పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. చిట్యాలలో బేడ బుడగ జంగాలతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బేడ బుడగ జంగాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలున్న వారికి రూ.5లక్షలు, కళాకారుల పింఛన్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లెం రామచంద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పర్వతం శ్రీనివాస్, సిరిశాల స్వామి, చల్లా రమేష్, కూరపాటి అనిల్, క్లెం రవీందర్, పర్వతం లింగస్వామి, సిరిశాల స్వామి పాల్గొన్నారు.

'బండి'కి ఘన స్వాగతం



బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

నకిరేకల్: ఖమ్మంలో శనివారం నిర్వహించిన చలో ఖమ్మం నిరుద్యోగ మార్చ్‌కు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి నకిరేకల్‌లో పార్టీ రాష్ట్ర నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చెనగాని రాములు, పట్టణ కార్యదర్శి మైల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి శ్యామ్ రెడ్డి, గుర్రం నాగచంద్రు, జల వెంకన్న, పబ్బు వెంకన్న, బ్రహ్మయ్య, ప్రకాశ్, గోపాల్, రమేష్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి: భారతదేశ మొట్టమొదటి ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ వర్ధంతిని శనివారం కేతేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ యూసుఫ్‌జానీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, బయ్య ముత్తయ్య, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

జమ్మికి నిప్పు.. పెట్రోల్ బంక్‌కు తప్పిన ప్రమాదం



కాలిపోయిన జమ్మిని పరిశీలిస్తున్న దైద రవీందర్

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో పెద్ద చెరువు కింద ఉన్న జమ్మికి గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎగిసిపడుతూ విస్తరించాయి. ఇదే రోడ్డులో టీపీసీసీ నాయకుడు దైద రవీందర్‌కు చెందిన పెట్రోల్ బంక్ ఉంది. గమనించిన బంక్ సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే, మంటలు మరింత ఉధృతం అయితే పెట్రోల్ బంక్‌కు ప్రమాదం జరిగి ఉండేది.

కావాలనే నిప్పు పెట్టారు..

నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులో పెట్రోల్‌బంక్ వెనక జమ్మికి గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టారని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ ఆరోపించారు. పెట్రోల్ బంక్ వెనక కాలిపోయిన జమ్మిని ఆయన పరిశీలించి మాట్లాడారు. జమ్మికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎండి యూసుఫ్, అబ్దుల్ మజీద్, వంటిపాక సతీష్, రాజశేఖర్, నర్సింగ్ మహేష్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న దీక్ష

మునుగోడు: మండలంలోని కిష్టాపురంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో చేపట్టిన రిలే దీక్ష శనివారం 37వ రోజూ కొనసాగింది. దీక్షలో గ్రామానికి చెందిన శ్రీదుర్గాభవాని మహిళా సంఘం సభ్యులు కూర్చునారు. ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు తదితరులు దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో యాదలక్ష్మి, రాములమ్మ, అండాలు, యాదమ్మ, మల్లమ్మ, పార్వతమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

మునుగోడు: కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహాగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఇప్పర్తిలో పార్టీ గ్రామశాఖ సమావేశం ఏర్పాటుచేసి నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికై న బొజ్జ మల్లయ్యకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, నాయకులు జగిని లింగారెడ్డి, బూడిద నర్సింహ, పరమేష్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత శిక్షణ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లిలో యువకులు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న గ్రంథాలయంలో వేసవిలో చిన్నారులకు పదిహేను రోజుల పాటు చెస్, క్యారం బోర్డు, డ్రాయింగ్ వంటి వాటిల్లో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో గత వారం రోజులుగా గ్రామానికి చెందిన చిన్నారులు గ్రంథాలయానికి వచ్చి శిక్షణ పొందుతున్నట్లు గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనువాస్ పేర్కొన్నారు. చిన్నారులలో సృజనాత్మకతను పెంపొందించటంతో పాటు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేయిందుకుగాను ఈ కార్యక్రమం చేపట్టినట్లు శనివారం ఆయన తెలిపారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఆర్థికసాయం అందజేత



అబ్దుల్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న 108 ఉద్యోగులు

నకిరేకల్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన నకిరేకల్ పట్టణానికి చెందిన 108 అంబులెన్స్ పైలట్ అబ్దుల్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ.1,08,101 అందజేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌస్, కిరణ్, యాదగిరి, సునీల్, శేఖర్‌రెడ్డి, నాగాచారి, చంద్రశేఖర్, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

కేతేపల్లి: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు తండు సుమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 41వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా వీఓఏల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. వీఓఏలను క్రమబద్ధీకరించి కనీసం వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. సమ్మెలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాడంగి వీరభద్రయ్య, వీఓఏలు ఏడాకుల సంధ్య, మరియరోజా, బి. సత్యనారాయణ, బయ్య రాణి, రామసుశీల, విజయశాంతి, భాగ్యలక్ష్మి, విజయ, సంధ్య, వరలక్ష్మి, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



సైదులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్: మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన శాగంటి సైదులు(37) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ సర్పంచ్ బూరుగు శ్రీను, ధార భిక్షం, మర్రి రాజరత్నం, సైదులు, రమేష్, మిట్టపల్లి శివ, కానుగు శ్రీను, యాదగిరి తదితరులు ఉన్నారు.